గాండే అసెంబ్లీ బైపోల్‌కు కల్పనా సొరేన్ నామినేషన్

రాంచీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ సతీమణి కల్పనా సొరేన్.. గాండే శాసనసభ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నికల బరిలో నిలిచారు. ఆమె జేఎంఎం అభ్యర్థిగా సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ముఖ్యమంత్రి చంపయీ సొరేన్, బావ బసంత్ సొరేన్, కాంగ్రెస్ జార్ఖండ్ శాఖ అధ్యక్షుడు రాజేశ్ ఠాకూర్, మంత్రులు అలంగిర్ ఆలం, సత్యానంద్ భోక్తా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జేఎంఎం ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ రాజీనామా చేయడంతో ఈ ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. పోలింగ్ మే 20న జరుగుతుంది, ఫలితాలు జూన్ 4న వెలువడతాయి.

ఇండోర్‌లో 'సూరత్' సీక్వెల్!

ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌కు మరో భారీ షాక్

నామినేషన్ ఉపసంహరించుకున్న పార్టీ అభ్యర్థి

బీజేపీలో చేరిక.. కథ నడిపిన విజయ్‌వర్గీయ

ఇది ప్రజాస్వామ్యంపై దాడి అన్న కాంగ్రెస్

ఇండోర్, ఏప్రిల్ 29: లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీకి మరో గట్టి షాక్ తగిలింది. ఇటీవల గుజరాత్‌లోని సూరత్‌లో ఆ పార్టీ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురవడంతో, ఎంపీగా బీజేపీ అభ్యర్థి ఏకగ్రీవం కాగా.. ఈసారి మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఏకంగా కాంగ్రెస్ అభ్యర్థి తన నామినేషన్‌ను ఉపసంహరించుకొన్నారు. నామినేషన్ల విత్‌డ్రాకు చివరి రోజైన సోమవారం అక్షయ్ కాంతి బామ్ తన నామినేషన్‌ను వెనక్కు తీసుకోవడం సంచలనంగా మారింది. ఈ విషయాన్ని ఇండోర్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఆశిష్ సింగ్ కూడా ధ్రువీకరించారు. అక్షయ్ కాంతి బామ్‌తో సహా ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ ఉపసంహరించుకొన్నారని తెలిపారు. ఈ అనూహ్య పరిణామం వెనుక బీజేపీ స్కెచ్ ఉన్నట్టు తెలుస్తున్నది. నామినేషన్ పత్రాలను ఉపసంహరించుకొనేందుకు బీజేపీ నేతలతో కలిసి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిన అక్షయ్ కాంతి.. ఆ తర్వాత నేరుగా బీజేపీ కార్యాలయానికి చేరుకొన్నారు. అనంతరం ఆ పార్టీలో చేరారు. మధ్యప్రదేశ్ డిప్యూటీ సీఎం జగదీశ్ దేవడా, మంత్రి కైలాశ్ విజయ్‌వర్గీయ, ఇతర పార్టీ నేతలతో కలిసి అక్షయ్ కాంతి దిగిన ఫొటోలను బీజేపీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇండోర్ లోక్‌సభ స్థానానికి నాలుగో దశ ఎన్నికల్లో భాగంగా వచ్చే నెల 13న పోలింగ్ జరుగాల్సి ఉన్నది. ఈ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ శంకర్ లాల్వానీ పోటీచేస్తున్నారు. ఇండోర్ లోక్‌సభ స్థానంలో మొత్తంగా కాంగ్రెస్ అభ్యర్థితో సహా తొమ్మిది మంది తమ నామినేషన్లు ఉపసంహరించుకోగా, బీజేపీ అభ్యర్థితో సహా 14 మంది ఎన్నికల బరిలో నిలిచారు.

కైలాశ్‌తో అక్షయ్ కాంతి (వెనక ఉన్న వ్యక్తి)

ఫొటోలు షేర్ చేసిన విజయ్‌వర్గీయ

కాంగ్రెస్ అభ్యర్థి అక్షయ్ కాంతి నామినేషన్ ఉపసంహరణ ఎపిసోడ్‌ను బీజేపీ సీనియర్ నేత, రాష్ట్ర మంత్రి కైలాశ్ విజయ్‌వర్గీయ నడిపించినట్టు తెలుస్తున్నది. అంతకుముందు నామినేషన్‌ను పత్రాలు వెనక్కు తీసుకొనేందుకు అక్షయ్ కాంతి బామ్.. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే రమేశ్ మెండోలాతో కలిసి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. విజయవర్గీయకు మెండోలా అత్యంత సన్నిహితుడు కావడం గమనార్హం. అనంతరం అక్షయ్ కాంతి బామ్ తమతో కలిసి ఓ కారులో కలిసి కూర్చొన్న ఫొటోను విజయవర్గీయ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ఆయన్ను బీజేపీలోకి ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. కాగా, తాజా పరిణామాల నేపథ్యంలో స్థానిక పత్రికార్ కాలనీలోని అక్షయ్ కాంతి నివాసం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రజాస్వామ్యానికి ముప్పు: కాంగ్రెస్

ఇండోర్‌లో తమ పార్టీ అభ్యర్థి నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంపై కాంగ్రెస్ స్పందించింది. దేశ ప్రజాస్వామ్యానికి ముప్పు పొంచివున్నదని పేర్కొన్నది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనేత్ మాట్లాడుతూ ఒక అభ్యర్థి తన నామినేషన్‌ను వెనక్కు తీసుకొని, బీజేపీలో చేరడం సాధారణమైనది కాదని అన్నారు. నామినేషన్లను ఉపసంహరించుకొనేలా అభ్యర్థులను బెదిరించడం, మభ్యపెట్టడం, ఒత్తిడి తేవడం జరుగుతున్నదని, ఇది ప్రజాస్వామ్యానికి ముప్పు అని పేర్కొన్నారు. ఈ పరిణామాలను ఎన్నికల సంఘం పట్టించుకోవడం లేదని, ఇక పారదర్శక ఎన్నికలు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అక్షయ్ కాంతికి మధ్యప్రదేశ్‌లో చాలా విద్యాసంస్థలు ఉన్నాయని, ఆయనపై హత్య కేసు అభియోగాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు.

డబ్బును చూసే ఆయనకు టికెట్.. కాంగ్రెస్ నేత ఆరోపణ

కాంగ్రెస్ అధిష్ఠానంపై ఆ పార్టీ ఇండోర్ సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవేంద్ర యాదవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తాజా పరిణామంపై ఆయన స్పందిస్తూ అక్షయ్ కాంతి డబ్బును చూసే ఆయనకు పార్టీ లోక్‌సభ టికెట్ ఇచ్చిందని, ఏండ్లుగా పార్టీని నమ్ముకొని ఉన్న తనలాంటి కార్యకర్తలకు మోసం చేసిందని ఆయన ఆరోపించారు. అక్షయ్ చివరి నిమిషంలో నామినేషన్ ఉపసంహరించుకొంటానని తాను ముందే ఊహించానని అన్నారు.

ఛత్తీస్‌గఢ్ చేజిక్కేదెవరికి?

- ఆసక్తికరంగా లోక్‌సభ ఎన్నికల పోరు
- ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో చతికిల పడిన కాంగ్రెస్
- అంతర్గత కుమ్ములాటలు, అవినీతి ఆరోపణలతో హస్తం పార్టీ సతమతం
- మోదీ చరిష్మానే నమ్ముకొన్న బీజేపీ

రాయ్‌పూర్, ఏప్రిల్ 29: గత ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ఛత్తీస్‌గఢ్‌లో ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల పోరు రసవత్తరంగా సాగుతున్నది. ఈసారి రాష్ట్రంలోని 11 స్థానాలను క్వీన్‌స్వీప్ చేయాలని అధికార బీజేపీ పావులు కదుపుతుండగా.. కమలం పార్టీకి అడ్డుకట్ట వేయాలని ప్రతిపక్ష కాంగ్రెస్ భావిస్తున్నది. రాష్ట్రంలో మూడు దశల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఈనెల 19, 26 తేదీల్లో జరిగిన రెండు దశల్లో నాలుగు లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలింగ్ పూర్తయింది. వచ్చే నెల 7న రాయ్‌పూర్, దుర్గ్, బిలాస్‌పూర్ సహా మిగిలిన ఏడు స్థానాల్లో ఓటింగ్ జరుగనున్నది.



గత లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఇలా

పార్టీ	2014	2019
బీజేపీ	10	9
కాంగ్రెస్	1	2

అంతర్గత పోరుతో కాంగ్రెస్ సతమతం

గత ఏడాది ఆఖరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయిన విషయం తెలిసిందే. బఘేల్ సర్కారును గద్దె దించిన బీజేపీ.. విష్ణుదేవ్ సాయి నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. లోక్‌సభ ఎన్నికల్లోనూ అదే ఊపు కొనసాగించాలని భావిస్తున్నది. మరోవైపు కాంగ్రెస్‌కు అంతర్గత పోరు, సీనియర్ నేతల మధ్య విభేదాలు ఇబ్బందికరంగా మారాయి. అలాగే గత ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న అవినీతి.. పార్టీ విజయావకాశాలను దెబ్బకొట్టే అవకాశం లేకపోలేదని విశ్లేషకులు అంటున్నారు.

బీజేపీలో కనిపించని బలమైన నేత

రాష్ట్ర బీజేపీ ప్రధానంగా మోదీ చరిష్మా, తమ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలను నమ్ముకొన్నది. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ మెజార్టీ స్థానాల్లో విజయం సాధించింది. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా 10, 9 స్థానాల్లో గెలిచింది. ఈ నేపథ్యంలో ఈసారి 11 స్థానాలనూ కైవసం చేసుకోవాలని కమలం పార్టీ లక్ష్యంగా పెట్టుకొన్నది. కేవలం మోదీ పాపులారిటీపైనే ఆధారపడుతున్న రాష్ట్ర బీజేపీలో బలమైన, ప్రముఖ నేత ఎవరూ కనిపించకపోవడం ఆ పార్టీకి కొంత ప్రతికూలంగా కనిపిస్తున్నది. మరోవైపు ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి అంశాల్లో బీజేపీ ప్రజల నుంచి వ్యతిరేకతను ఎదుర్కొంటున్నది. అయితే రాష్ట్రంలోని గత బఘేల్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు, ఆ పార్టీ సీనియర్ల మధ్య విభేదాలు బీజేపీ కలిసొచ్చే అవకాశం ఉన్నదని విశ్లేషకులు అంటున్నారు.

మోదీని ఆరేండ్లు అనర్హుడిగా ప్రకటించాలి

- దేవుళ్ల పేరుతో ఓట్లడుగుతున్న ప్రధాని ఎన్నికల్లో పోటీకి అనర్హుడు
- ఢిల్లీ హైకోర్టులో పిటిషన్.. కొట్టేసిన కోర్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: దేవుళ్ల పేరుతో ఓట్లు అడుగుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆరేండ్లపాటు ఎన్నికల్లో పోటీచేయకుండా అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు సోమవారం కొట్టివేసింది. పిటిషన్‌లో ఎలాంటి విచారణ అర్హతలు లేవని జస్టిస్ సచిన్‌దత్తా ధర్మాసనం వెల్లడించింది. ప్రధాని మోదీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని ఢిల్లీ హైకోర్టు న్యాయవాది ఆనంద్ ఎస్ జొంధాలే పిటిషన్‌లో పేర్కొన్నారు. దేవుళ్ల పేరుతో ఓట్లు అడుగుతున్నారని, ఎన్నికల్లో పోటీచేయకుండా మోదీని అనర్హుడిగా ప్రకటించడంతోపాటు ఆరేండ్లపాటు ఆయనపై నిషేధం విధించాలని కోరారు. పిలిభిత్ ఎన్నికల ప్రచార సభలో హిందూ దేవతలు, ప్రార్థనా స్థలాలతో పాటు సిక్కు దేవతల పేర్లతో తమ పార్టీకి ఓట్లు వేయాలని మోదీ అడిగారని పిటిషన్‌లో న్యాయవాది ఆరోపించారు. విచారణ జరిపిన ఏకసభ్య ధర్మాసనం.. 'ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినట్టు పిటిషనర్ భావించారు. ఆ భావన పూర్తిగా అసంబద్ధం. దీనిని ఆధారంగా చేసుకొని పిటిషనర్ కోరినట్టు నిర్దిష్ట ఆదేశాలు జారీ చేయాలని భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించలేం' అని పేర్కొన్నది.

మూడో దశ బరిలో 1,352 మంది

- అందులో 123 మంది మహిళలు
- 244 మందిపై క్రిమినల్ కేసులు
- 392 మంది కోటీశ్వరులు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల మూడో దశలో మొత్తం 1,352 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వీరిలో మహిళలు 123 మంది (9 శాతం) కాగా, క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నవారు 244 మంది (18 శాతం). 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 94 స్థానాల్లో మే 7న జరిగే పోలింగ్‌లో ఓటర్లు వీరి భవిష్యత్తును నిర్ణయించబోతున్నారు. వీరి నామినేషన్లను పరిశీలించిన అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), ది నేషనల్ ఎలక్షన్ వాచ్ ఈ వివరాలను వెల్లడించాయి.



మూడో దశలో పోటీ చేస్తున్నవారిలో 392 మంది (29 శాతం) కోటీశ్వరులు ఉన్నారు. వీరి సగటు సంపద విలువ రూ.5.66 కోట్లు. అత్యధిక సంపన్న అభ్యర్థికిగల సంపద విలువ రూ.1,361 కోట్లు.

పెండ్లి పత్రికలో 'మోదీ' ప్రస్తావన.. చిక్కుల్లో వరుడు

బెంగళూరు, ఏప్రిల్ 29: వివాహ ఆహ్వాన పత్రికలో ప్రధాని మోదీ పేరును ప్రస్తావించటం.. ఓ నవ వరుడ్ని ఇబ్బందుల్లో పడేసింది. ఎన్నికల కోడ్‌ను పర్యవేక్షిస్తున్న అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ వ్యవహారంపై కేసు నమోదు చేశారు. కర్ణాటకలో దక్షిణ కన్నడ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ యువకుడు తన పెండ్లి పత్రికలో..'ప్రధానిగా మోదీని మరోసారి గెలిపించటమే మా జంటకు మీరు ఇచ్చే గొప్ప బహుమతి' అని పేర్కొన్నాడు. ఇది గమనించిన బంధువొకరు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఏప్రిల్ 14న పుత్తూరు తాలుకాలోని వరుడి ఇంటికి ఎన్నికల అధికారులు వెళ్లారు. ఎన్నికల షెడ్యూల్ రాకముందే మార్చి 1న ఆహ్వాన పత్రికలు ముద్రించానని అతడు సమాధానమిచ్చాడు. అయినప్పటికీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బీజేపీకి ముందే తెలుసు!

- ప్రజ్వల్ సెక్స్ స్కాండల్‌పై ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముందే హెచ్చరిక
- స్పందించని బీజేపీ అధినాయకులు
- జేడీఎస్ నుంచి ప్రజ్వల్ సస్పెండ్!
- ప్రజ్వల్ ఎపిసోడ్‌తో లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయేకు ఎదురుదెబ్బ!

మోదీతో రేవణ్ణ, ప్రజ్వల్ ఉన్న ఫొటోను చూపుతున్న కాంగ్రెస్ నేత అల్క లాంబా

బెంగళూరు, ఏప్రిల్ 29: కర్ణాటక రాజకీయాల్లో సంచలనం రేపిన జేడీ(ఎస్) ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ స్కాండల్‌లో మరిన్ని సంచలనాలు వెలుగులోకి వస్తున్నాయి. సెక్స్ వీడియోల గురించి బీజేపీ హోలెనర్సిపుర అసెంబ్లీ అభ్యర్థి దేవరాజె గౌడ గతేడాది డిసెంబర్ 8న కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు విజేయేంద్రకు లేఖ రాశారు. 'ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించి దాదాపు మూడు వేల సెక్స్ స్కాండల్ వీడియోలు కాంగ్రెస్ నాయకుల చేతికి దొరికాయి. ఇవి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బ్లాక్‌మెయిల్ చేసే బ్రహ్మాస్త్రం కావొచ్చు. జాతీయ స్థాయిలో ఇది మన పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తుంది' అని ఆ లేఖలో దేవరాజెగౌడ పేర్కొన్నారు. ఈ ఉదంతంపై బీజేపీ కేంద్ర, రాష్ట్ర అధి నాయకులు ఇప్పటివరకు స్పందించకపోవడం చర్చనీయాంశమైంది.

ప్రజ్వల్ కావాలా.. ఎమ్మెల్యేలు కావాలా?

ప్రజ్వల్ రేవణ్ణ అసభ్యకర వీడియోల ఉదంతం జేడీ(ఎస్)కు సొంత ఎమ్మెల్యేల నుంచే నిరసన వ్యక్తమవుతున్నది. పార్టీకి 19 మంది ఎమ్మెల్యేలు కావాలో.. ప్రజ్వల్ కావాలో తేల్చుకోవాలని కోలార్ ఎమ్మెల్యే సమృద్ధి వి మంజునాథ్ జేడీఎస్ అధిష్ఠానానికి లేఖ రాశారు. ప్రజ్వల్‌పై వచ్చిన ఆరోపణలు పార్టీ నాయకులను సిగ్గు పడేలా చేస్తున్నాయని.. ప్రజలు, మీడియా అడిగే ప్రశ్నలకు తాము సమాధానం చెప్పలేకపోతున్నామని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజ్వల్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని నిర్ణయించినట్టు జేడీఎస్ అధినేత కుమారస్వామి ప్రకటించారు.

చీర పిన్నులు తొలగించి వేధించేవారు

రేవణ్ణ, ఆయన కుమారుడు ప్రజ్వల్ తనను లైంగికంగా వేధించేవారని వారి ఇంట్లో వంట మనిషి ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'భార్య ఇంట్లో లేనప్పుడు రేవణ్ణ పనివారి చీర పిన్నులు తొలగించి అసభ్యంగా తాకేవారు' అని ఆమె తెలిపారు.

ఇది రాజకీయ కుట్ర: రేవణ్ణ

తనపైన, తన కుమారుడిపైన వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలు రాజకీయ ప్రేరేపితం, కుట్ర అని జేడీఎస్ ఎమ్మెల్యే రేవణ్ణ సోమవారం మీడియాకు తెలిపారు. వైరల్ అవుతున్న వీడియోలు నాలుగేండ్ల క్రితంవని వ్యాఖ్యానించారు. ప్రజ్వల్ విచారణకు వస్తారని వెల్లడించారు.

మోదీ, కేంద్రంపై విపక్షాల ఆగ్రహం

సెక్స్ స్కాండల్ ఉదంతంపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. శివసేన(యూబీటీ) రాజ్యసభ ఎంపీ ప్రియాంక చతుర్వేది దీనిపై ఎక్స్‌లో స్పందిస్తూ.. ఈ విషయంపై జాతీయ మహిళా కమిషన్, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ మౌనంగా ఉండటం తనను షాక్‌కు గురి చేసిందన్నారు. 'మోదీజీ మీ కూటమి అభ్యర్థి మహిళలను లైంగికంగా వేధిస్తున్నట్టు వీడియోల్లో కనిపిస్తున్నది. ఆమె ఏడుస్తున్నా.. అతడు దాన్ని వీడియో తీస్తూనే ఉన్నాడు. ప్రజ్వల్ ఇప్పుడు దేశంలో లేడు. 'నారీశక్తి' మీద మీ ప్రతిస్పందన కోసం ఎదురుచూస్తున్నా' అని టీఎంసీ రాజ్యసభ ఎంపీ సాగరికా ఘోష్ ఎక్స్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు.

టీచర్ రిక్రూట్‌మెంట్ స్కాం దర్యాప్తుపై స్టే

మమత సర్కారుకు ఊరట

న్యూఢిల్లీ: టీచర్ రిక్రూట్‌మెంట్ స్కాం కేసులో బెంగాల్ ప్రభుత్వ ఉద్యోగుల పాత్రపై సీబీఐ విచారణ చేపట్టాలంటూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది. కేసు విచారణను మే 6కి వాయిదా వేసింది. 25,753 ఉద్యోగ నియామకాలు చెల్లవంటూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పును బెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.

వ్యక్తుల ప్రయోజనాల కోసం సుప్రీంకోర్టుకు రాష్ట్రప్రభుత్వమా?

సందేశ్‌ఖాలీ దారుణాల కేసులో ప్రైవేట్ వ్యక్తుల ప్రయోజనాలను కాపాడటానికి రాష్ట్ర ప్రభుత్వం ఓ పిటిషనర్‌గా కోర్టుకు రావడాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. సందేశ్‌ఖాలీలో భూ కబ్జాలు, మహిళలపై నేరాలకు సంబంధించిన ఆరోపణలపై దర్యాప్తు బాధ్యతలను సీబీఐకి అప్పగిస్తూ ఏప్రిల్ 10న కలకత్తా హైకోర్టు ఆదేశాలిచ్చింది. హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ జరిపింది.

సీపీ పరీక్షల వాయిదాకు నిరాకరణ

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చార్టెడ్ అకౌంటెన్సీ(సీఏ)లో కొన్ని పేపర్లకు సంబంధించి పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు

తిరస్కరించింది. పోలింగ్ తేదీల్లో (మే 7, మే 13) సీఏ పరీక్షలను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) నిర్వహించటం లేదన్న విషయాన్ని గుర్తుచేసింది. పరీక్షల షెడ్యూల్ 'విధానపరమైన నిర్ణయం' అంటూ పిల్‌ని తిరస్కరించింది.

గర్భవిచ్ఛిత్తి కేసు తీర్పు ఉపసంహరణ

లైంగిక దాడి కారణంగా గర్భవతి అయిన 14 ఏళ్ల బాలికకు గర్భవిచ్ఛిత్తి చేయడానికి ఇటీవల ఇచ్చిన అనుమతిని సుప్రీంకోర్టు సోమవారం ఉపసంహరించింది. 30 వారాల గర్భాన్ని వైద్యపరంగా తొలగించేందుకు ఇటీవల అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆమెకు గర్భస్రావం చేసినట్లయితే, ఆమె ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని, ఆమెకు జన్మించే బిడ్డను సంరక్షిస్తామని, ఆమె తల్లిదండ్రులు సుప్రీంకోర్టుకు తెలియజేయడంతో సర్వోన్నత న్యాయస్థానం తాజా నిర్ణయం తీసుకుంది.

దవాఖానల్లో రేట్ల నిర్ణయంపై పిల్

దవాఖానల్లో రోగుల నుంచి వసూలు చేయదగిన రేట్లను నిర్ణయించడానికి సంబంధించిన నిబంధనను అమలు చేయవద్దని కోరుతూ పిల్ దాఖలైంది. దీనిపై స్పందించాలని సుప్రీంకోర్టు కేంద్రానికి నోటీసు ఇచ్చింది. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ రూల్స్, 2012లోని తొమ్మిదో నిబంధనను అమలు చేయరాదని పిటిషనర్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించి కేంద్రం నిర్ణయించే ధరల మేరకే రోగుల నుంచి చార్జీలు వసూలు చేయాలని ఈ నిబంధన చెప్తున్నది.

నీట్ పీజీ ఇంటర్న్‌షిప్ కటాఫ్ తేదీ పొడిగింపునకు నో

ఈ ఏడాది జూన్ 23న జరగనున్న నీట్ పీజీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఇంటర్న్‌షిప్ కటాఫ్‌ను పొడిగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను స్వీకరించేందుకు సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. ఇది పూర్తిగా విధానపరమైన అంశంగా సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. 'కటాఫ్ ఉన్నప్పుడు అభ్యర్థులు ఎవరన్నది తేల్చే నిర్దిష్టమైన రేఖ ఏర్పడుతుంది' అని సీజేఐ అన్నారు.

ఎన్నికల అధికారిపై బీజేపీ నేత దాడి

అరెస్ట్ చేసిన పోలీసులు

గువాహటి: త్రిపురలో బీజేపీ నాయకుడు ఒకరు ఎన్నికల అధికారిపై దాడికి తెగబడ్డారు. రెండో దశ పోలింగ్ సందర్భంగా శుక్రవారం త్రిపుర ఈస్ట్ నియోజకవర్గంలో బీజేపీ నేత కాజల్ దాస్ ప్రిసైడింగ్ అధికారిపై చేయిచేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. పలువురు ఇతర వ్యక్తులు కూడా అధికారిపై దాడి చేస్తున్నట్టు అందులో ఉన్నది. వారెవన్నది ఇంకా నిర్ధారించాల్సి ఉన్నది. ప్రిసైడింగ్ అధికారి ఫిర్యాదు మేరకు పోలీసులు.. దాడికి పాల్పడిన బీజేపీ నేతను సోమవారం అరెస్ట్ చేశారు.

కేంద్ర మాజీ మంత్రి శ్రీనివాస ప్రసాద్ కన్నుమూత

బెంగళూరు: బీజేపీ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి వీ శ్రీనివాస ప్రసాద్ (76) సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. చామరాజ్ నగర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఆయన ఆరుసార్లు ఎంపీగా గెలిచారు. 1974లో ఆయన మొదటిసారి స్వతంత్ర అభ్యర్థిగా శాసనసభ ఎన్నికల్లో పోటీ చేశారు. 1976లో జనతా పార్టీలో చేరారు. 1999 నుంచి 2004 వరకు అప్పటి ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి మంత్రివర్గంలో వినియోగదారుల వ్యవహారాల శాఖ సహాయ మంత్రిగా పని చేశారు.

14 పతంజలి ఉత్పత్తుల లైసెన్స్‌లు రద్దు

న్యూఢిల్లీ: తప్పుదోవ పట్టించే వ్యాపార ప్రకటనల కేసులో బాబా రామ్‌దేవ్ నేతృత్వంలోని 'పతంజలి'పై చర్యలు ప్రారంభమయ్యాయి. దివ్య ఫార్మసీకి చెందిన 14 ఉత్పత్తుల లైసెన్సులను సస్పెండ్ చేసినట్లు ఉత్తరాఖండ్ లైసెన్సింగ్ అథారిటీ సోమవారం సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో తెలిపింది. బాబా రామ్‌దేవ్, ఆయన సహచరుడు ఆచార్య బాలకృష్ణ వార్తా పత్రికల్లో ప్రచురించిన క్షమాపణలపై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరుపుతుంది. వీరిద్దరూ కోర్టుకు హాజరవుతారు.

యూజీసీ-నెట్ జూన్ 18కి వాయిదా

న్యూఢిల్లీ: జాతీయ అర్హత పరీక్ష(నెట్)ను రీ షెడ్యూల్ చేసి జూన్ 18కి వాయిదా వేస్తున్నట్లు యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ సోమవారం ప్రకటించారు. గతంలో ఈ పరీక్షను జూన్ 16న నిర్వహించాలనుకున్నారు. అయితే అదే రోజు యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష ఉండటంతో నెట్ పరీక్షను వాయిదా వేయాలని అభ్యర్థులు కోరారు. ఈ నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, యూజీసీ నెట్ పరీక్షను వాయిదా వేశాయి. జూన్ 18న నెట్ పరీక్షను ఒకే రోజు దేశమంతటా ఓఎమ్ఆర్ విధానంలో నిర్వహిస్తారు.

ఛత్తీస్‌గఢ్ ఉద్యమకారుడికి 'గ్రీన్ నోబెల్'

న్యూఢిల్లీ: అడవులు, గిరిజన హక్కుల కార్యకర్త అలోక్ శుక్లా ఈ ఏడాదికి గాను ప్రతిష్ఠాత్మక గోల్డ్‌మ్యాన్ ఎన్విరాన్‌మెంటల్ పురస్కారానికి ఎంపిక య్యారు. ఛత్తీస్‌గఢ్‌లో 4.45 లక్షల ఎకరాల్లో వ్యాపించి ఉన్న హస్దియో అడవుల్లో గనుల తవ్వకం జరగకుండా నిరోధించి జీవవైవిధ్యానికి తోడ్పడినందుకు ఆయనకు ఈ పురస్కారం లభించింది. 'గ్రీన్ నోబెల్'గా పిలిచే ఈ పురస్కారాన్ని క్షేత్రస్థాయిలో బాగా పనిచేసే పర్యావరణ ఉద్యమకారులకు అందిస్తారు. హస్దియో అడవుల్లో 21 ప్రతిపాదిత బొగ్గు గనుల తవ్వకానికి వేలం జరగకుండా శుక్లా ఆపగలిగారని గోల్డ్‌మ్యాన్ ఎన్విరాన్‌మెంటల్ ఫౌండేషన్ ప్రశంసించింది.

కొవిడ్ టీకా సైంటిస్ట్‌పై చైనా వేటు

బీజింగ్: కొవిడ్-19 టీకా అభివృద్ధిలో పాలుపంచుకున్న టాప్ సైంటిస్ట్‌పై చైనా వేటేసింది. అవినీతి ఆరోపణలపై ఆయనను పార్లమెంటు నుంచి బహిష్కరించింది. ఆయన పేరు యాంగ్ షావోమింగ్. చైనా నేషనల్ ఫార్మాస్యూటికల్ గ్రూప్ వ్యాక్సిన్ సబ్సిడరీ అయిన చైనా నేషనల్ బయోటెక్ గ్రూప్ (సీఎన్‌బీజీ)కి ఆయన చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. క్రమశిక్షణ, చట్ట ఉల్లంఘనకు సంబంధించి తీవ్రమైన అభియోగాల నేపథ్యంలో నేషల్ పీపుల్స్ కాంగ్రెస్ పార్టీ ఆయన సభ్యత్వాన్ని రద్దు చేసింది.

కెన్యాలో డ్యామ్ కూలి 45 మంది మృతి

నైరోబీ: పశ్చిమ కెన్యాలో భారీ డ్యామ్ కూలిపోవడంతో 45 మంది దుర్మరణం చెందారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వానలకు డ్యామ్‌లోకి భారీగా నీరు చేరడంతో సోమవారం తెల్లవారుజామున ఒక్కసారిగా డ్యామ్ గోడలు కూలిపోయాయి. ఒక్కసారిగా నీటిప్రవాహం ఇండ్ల మీదుగా రావడంతో సుమారు 45 మంది చనిపోయారని అధికారులు తెలిపారు. రిఫ్ట్‌వ్యాలీకి చెందిన మాయి మహియ